నియోజకవర్గంగా కేసముద్రం..?

- కొత్త నియోజకర్గంగా మారనున్న కేసముద్రం
- ముందస్తుగానే పావులు కదుపుతున్న అగ్రనాయకులు
- వచ్చే ఎన్నికల్లో జెండా పాతేందుకు నేతలు ఎత్తులు
- కేసముద్రంపై గురిపెడుతున్న కీలక నాయకులు
- పాగా వేసేందుకు వేం నరేందర్ రెడ్డి, వద్దిరాజు, హుస్సేనాయక్ ప్లాన్స్
- వేం నరేందర్ రెడ్డి సారథ్యంలో వేలాది కోట్లతో స్థానికంగా కొనసాగుతున్న పనులు
- ప్రభుత్వ వైఫల్యాలే కలిసి వస్తాయని భావిస్తున్న వద్దిరాజు
- రైతులు, యువత లక్ష్యంగా సేవా కార్యక్రమాలతో హుస్సేన్ నాయక్ అడుగులు
- రైతులకు పంపుసెట్ కిట్లు, విద్యార్థులకు సైకిళ్లు, మానుకోట ఆస్పత్రికి అంబులెన్స్‌లు, గూడురు శివాలయానికి ప్రత్యేక నిధులు

- గత రెండు పర్యాయాలు మానుకోటలో ఓటమిపాలైన హుస్సేన్ నాయక్
- జనరల్ కేటగిరి వస్తే కేసముద్రంలో త్రిముఖ పోటీ ఉండే ఛాన్స్





కేసముద్రం అక్టోబర్ 23(ప్రభాత గమనం):

మానుకోట జిల్లాలోని కేసముద్రం ఇప్పటి వరకు ఒక మండల కేంద్రం. కానీ భవిష్యత్‌లో నియోజకవర్గ పునర్విభజన జరిగి కేసముద్రం కేంద్రంగా కొత్త అసెంబ్లీ సెగ్మెంట్ ఏర్పడితే, ఈ ప్రాంత రాజకీయ ప్రాధాన్యత ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అధికారికంగా కేసముద్రం మండలం మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో భాగంగా ఉంది. కొత్త నియోజకవర్గం ఏర్పడుతుందన్నది ఇప్పటికీ అధికారికంగా ఖరారైన విషయం కాదు. అయితే, ఈ అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైతే మాత్రం స్థానికంగా నాయకుల కదలికలు, ప్రజా సంబంధాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెరగడం సహజమే.

ముందుగానే పావులు కదుపుతున్నారా?

రాజకీయాల్లో నియోజకవర్గం ఏర్పడిన తర్వాత నాయకులు రంగంలోకి దిగడం ఒక విధానం. కానీ నియోజకవర్గం ఏర్పడే అవకాశం ఉందనే చర్చ మొదలైనప్పటి నుంచే ప్రాంతంలో సామాజిక, రాజకీయ, సేవా కార్యక్రమాలను విస్తరించడం మరో వ్యూహం. ఈ కోణంలో కేసముద్రం చుట్టూ ఇప్పటికే పలువురు కీలక నాయకుల పేర్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తున్నాయి. వేం నరేందర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, హుస్సేన్ నాయక్ వంటి నాయకులు కేసముద్రం ప్రాంతంలో తమ తమ రాజకీయ స్థావరాలను బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తే, భవిష్యత్‌లో ఈ ప్రాంతం ఒక ఆసక్తికరమైన రాజకీయ పోటీ వేదికగా మారే అవకాశం ఉంటుంది. అయితే ఎవరు ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారు, ఏ పార్టీ తరఫున బరిలో ఉంటారు, నియోజకవర్గం రిజర్వేషన్ ఎలా ఉంటుంది అనే అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

"అభివృద్ధి పథంతో చక్రం తిప్పుతున్న వేం"

వేం నరేందర్ రెడ్డికి కేసముద్రం ప్రాంతంతో వ్యక్తిగత, రాజకీయ అనుబంధం ఉంది. ఆయన జన్మస్థలం మండలకేంద్రంలోని అర్వనపల్లి గ్రామం. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి సలహాదారుగా కొనసాగుతున్నారు. అభివృద్ధి పనులు, ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం, స్థానిక సమస్యల పరిష్కారానికి తన పరిధిలో ప్రయత్నాలు విస్తృతంగా చేస్తున్నారు. కోట్లాది రూపాయలతో కేసముద్రంలో రోడ్ల విస్తరణ పనులు చేపడుతుండగా.. డిగ్రీ కాలేజీ, ఫైర్ స్టేషన్, పాలిటెక్నిక్ కాలేజీ తదితరాలు మంజూరు చేయించి అనతికాలంలోనే వాటిని ప్రారంభించారు. స్థానిక అర్వనపల్లి గ్రామంలో సెంట్రల్ లైటింగ్ ని ప్రారంభించారు. స్థానికంగా ప్రజా నాయకుడిగా పేరొందిన వేం నరేందర్ రెడ్డి.. కేసముద్రం తనను శాసనసభకు పంపుతుందనే ప్రగాఢ విశ్వాసంతో ఉన్నారని తన అనుచర వర్గాలు చెప్తున్నమాట.

"వద్దిరాజుకి కలిసిరానున్న ప్రభుత్వ వైఫల్యాలు"

మరోవైపు బీఆర్ఎస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఇటీవలి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తున్నారు. స్థానిక సమస్యలు, ప్రభుత్వ పనితీరు , రైతు సమస్యలు ఉపాధి వంటి అంశాలను ప్రతిపక్షం ప్రచార అజెండాగా మార్చే అవకాశం ఉంటుంది. రేవంత్ సర్కార్ వైఫల్యాలే.. తనకి కలిసివస్తాయని భావిస్తున్నారట. తన స్వగ్రామమైన ఇనుగుర్తి గత ఏడాది క్రితం మండల కేంద్రంగా మారింది. గత బీఆర్ఎస్ హయాంలో అంతిమ క్షణాలలో ఇనుగుర్తిని మండల కేంద్రంగా ప్రకటించారు. అందులో వద్దిరాజు రవిచంద్ర పాత్ర, ప్రభుత్వ పెద్దలను ఒప్పించడంలో తను కీలక పాత్ర పోషించారనే నానుడి ఉంది. రాబోయే కేసముద్రం నియోజకవర్గంలో ఇనుగుర్తి అతిపెద్ద మండల కేంద్రంగా ఉండటం ఒకటి కాగా.. అతిపెద్ద ఓటు బ్యాంకు ఉన్న ప్రాంతంగా కూడా తనకు కలిసొచ్చే రెండో అంశంగా చెప్పవచ్చు. ఇనుగుర్తి మండలం మొత్తంలో వద్దిరాజు చక్రం తిప్పి కేసముద్రం తొలిసారి జెండా పాతాలనే ఎత్తులతో కార్యాచరణ సిద్ధం చేసుకున్నారని తెలుస్తోంది. స్థానికంగా జరిగే అభివృద్ధి కంటే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాల ఎజెండానే గ్రామీణ ప్రజల్లోకి తీసుకెళ్లి పాగా వేయాలని పావులు కదుపుతున్నారట.

"సేవా కార్యక్రమాల్లో హుస్సేన్ నాయక్"

మరోవైపు హుస్సేన్ నాయక్ పేరు కూడా స్థానిక రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. రైతులకు పంపుసెట్ కిట్లు, విద్యార్థులకు సైకిళ్లు, మానుకోట ఆస్పత్రికి అంబులెన్స్‌లు, గూడూరు శివాలయానికి ప్రత్యేక నిధులు వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో సంబంధాలను విస్తరించుకోవాలనే ప్రయత్నంలో ముందున్నారు హుస్సేన్ నాయక్. ఇక్కడ రాజకీయంగా గమనించాల్సిన అంశం సేవా కార్యక్రమాల సంఖ్య కంటే.. వాటి సామాజిక పరిధి కూడా హుస్సేన్ నాయక్‌కి కలిసిరానుంది. రైతులు, విద్యార్థులు, వైద్య సేవలు, మతపరమైన సంస్థలు వంటి విభిన్న వర్గాలతో అనుసంధానం ఏర్పడితే, అది ఒక నాయకుడికి స్థానిక స్థాయిలో వ్యక్తిగత గుర్తింపును పెంచగలదు. అయితే గత రెండు ఎన్నికల్లో మానుకోట నుంచి ఆయన ఓటమిపాలయ్యారన్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. గత ఎన్నికల ఫలితాలు భవిష్యత్ నియోజకవర్గంలో అదే విధంగా పునరావృతమవుతాయని మాత్రం చెప్పలేం. ఎందుకంటే నియోజకవర్గ భౌగోళిక పరిధి, సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్, పార్టీ పొత్తులు, అభ్యర్థుల ఎంపిక అన్నీ మారే అవకాశం ఉంటుంది. అదేవిధంగా కేసముద్రం పరిధిలో ఎస్టీ ఓటర్ బ్యాంక్ హుస్సేన్ నాయక్ సామాజికవర్గంగా కలిసిరానుంది. యూత్‌ని తనవైపు మళ్లించుకోవాలనే ప్రయత్నంలో ఈ నేత నిమగ్నమయ్యారు. ప్రస్తుత జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుగా ఉండగా తన బాధ్యతల పదవికాలం పూర్తికాగానే మానుకోటలో పాగా వేసి అటు కేసముద్రంలో చక్రం తిప్పే ప్రణాళికలు రచిస్తున్నారట.ఒకవేళ భవిష్యత్‌లో కేసముద్రం కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడి, అది జనరల్ కేటగిరీగా వస్తే?.. అప్పుడు ప్రస్తుతం వివిధ వర్గాల్లో ఉన్న నాయకత్వ ఆశలు ప్రత్యక్ష రాజకీయ పోటీగా మారే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితిలో మూడు వేర్వేరు రాజకీయ నమూనాలు కనిపించవచ్చు:

1. అధికార పార్టీ బలం – ప్రభుత్వ పనులు, సంక్షేమం, అభివృద్ధి
2. ప్రతిపక్ష బలం – ప్రభుత్వ వైఫల్యాలు, రైతు సమస్యలు, స్థానిక అసంతృప్తి
3. వ్యక్తిగత సామాజిక బలం సేవా కార్యక్రమాలు, వ్యక్తిగత పరిచయాలు, స్థానిక నెట్‌వర్క్

ఈ మూడు అంశాలు ఒకే నియోజకవర్గంలో ఢీకొంటే, పోటీ కేవలం పార్టీ గుర్తుల మధ్యే కాకుండా "ఎవరి స్థానిక బలం ఎంత?" అనే ప్రశ్న చుట్టూ కూడా తిరిగే అవకాశం ఉంటుంది. కానీ ఒక విషయం మాత్రం మర్చిపోవద్దు. . జకీయాల్లో ఒక నాయకుడికి ఉన్న వ్యక్తిగత ప్రభావం, పార్టీ బలం, ప్రభుత్వ అధికారంలో ఉన్న పార్టీకి ఉన్న సంస్థాగత బలం ఇవన్నీ వేర్వేరు. అభివృద్ధి పనులు ఉన్నంత మాత్రాన ఓట్లు రావు. సేవా కార్యక్రమాలు చేసినంత మాత్రాన ఎన్నిక గెలిచినట్టుకాదు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నంత మాత్రాన ప్రతిపక్షానికి విజయం ఖాయం కాదు. అలాగే గత ఎన్నికల్లో ఓటమి ఎదురైనంత మాత్రాన భవిష్యత్ అవకాశాలు ముగిసిపోయినట్టూ కాదు. ఎన్నికల సమయానికి అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, పార్టీ పరిస్థితి, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, కుల వర్గ సమీకరణాలు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయం, బూత్ స్థాయి సంస్థాగత బలం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాన్ని ప్రభావితం చేస్తాయి.

కేసముద్రం రాజకీయాలకు అసలు పరీక్ష అక్కడే...

కేసముద్రం నిజంగా నియోజకవర్గంగా మారితే.. అది కేవలం కొత్త నియోజకవర్గం కాదు – కొత్త రాజకీయ సమీకరణాలకు ప్రయోగశాలగా మారే అవకాశం ఉంది. కొత్త నియోజకవర్గం ఏర్పడుతుందా లేదా అనేది ఒక పరిపాలనా నిర్ణయం. కానీ ఏర్పడితే దాని రాజకీయ స్వరూపం ఎలా ఉండాలి అనేది ప్రజల చేతిలో ఉండే ప్రశ్న. అభివృద్ధి చేసినవారా?, ప్రజల్లో అందుబాటులో ఉన్నవారా?, సేవ చేసినవారా?, ప్రభుత్వాన్ని ప్రశ్నించగలిగినవాడా?, లేక అన్ని వర్గాలను కలుపుకుపోగలిగిన నాయకురా?. చివరికి ప్రజలు ఏ అంశాన్ని ప్రధానంగా పరిగణిస్తారన్నదే కేసముద్రం రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారుతుంది. అందుకే ఇప్పటి నుంచే కేసముద్రం చుట్టూ కనిపిస్తున్న రాజకీయ కదలికలను ఎవరు గెలుస్తారు? అనే కోణంలో కాకుండా, ఎవరు ఏ సామాజిక వర్గంతో, ఏ అంశంతో, ఏ రాజకీయ నారేటివ్‌తో ప్రజల్లోకి వెళ్తున్నారు? అనే కోణంలో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది.

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

అక్రమ నిర్మాణాల కూల్చివేత....

- ప్రభుత్వ భూముల్లో కబ్జాలను సహించేది లేదు...
- కాప్రా తహసీల్దార్ మతిన్....



సిటీ బ్యూరో అక్టోబర్ 22, (ప్రభాత గమనం):

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండల్ పరిధిలోని జవహర్ నగర్ ప్రాంతంలో దసరా పండుగ సెలవు దినాలను అదునుగా చేసుకొని భూ కబ్జాదారులు విచ్చలవిడిగా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు గిర్దావర్ సత్యనారాయణ సమక్షంలో రెవెన్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో ఈ చర్యలు చేపట్టారు.జవహర్ నగర్‌లోని వికలాంగుల కాలనీ, బీరప్పగడ్డ, సేవాలాల్ తండ,లక్ష్మీ నరసింహ కాలనీలలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు కూల్చివేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ జవహర్ నగర్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను అమాయక పేదలకు విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, అటువంటి అక్రమాలకు పాల్పడే వారిపై త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా రెవెన్యూ శాఖ పనిచేస్తోందని పేర్కొన్నారు. జవహర్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కూల్చివేతల కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేసముద్రం అక్టోబర్ 13(ప్రభాత గమనం):

రెడ్ క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయమని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీకి జిల్లా చైర్మన్ గా ఎన్నికైన మాదవ పెద్ది వెంకట్ రెడ్డిని, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన రావుల రవిచందర్ రెడ్డిలను మంగళవారం నాడు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ మానవతా దృక్పథంతో పేదలకు అండగా నిలుస్తోందన్నారు. రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు సహాయం అందించడంలో రెడ్ క్రాస్ ముందుంటుందని కొనియాడారు.కొత్తగా ఎన్నికైన చైర్మన్ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు రవిచందర్ రెడ్డిల నాయకత్వంలో జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు మరింత విస్తృతంగా ప్రజలకు అందాలని ఆకాంక్షించారు. వారికి తన తరపున శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, మాజీ జెడ్పి చైర్మన్ ఆంగోత్ బిందులు ఉన్నారు.

ఘనంగా దేవి నవరాత్రుల ఉత్సవాలు

- ఛత్రపతి శివాజీ టీమ్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు,మహా అన్నదానం...



కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు...

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు....
- బిఆర్ఎస్ పాలనలో 24 గంటల కరెంట్....
- నీళ్లు లేక అన్నదాతల ఆగమాగం....



కేసముద్రం అక్టోబర్ 15(ప్రభాత గమనం):

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు చేతికొచ్చే సమయంలో సరైన విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని మానుకోట మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కేసముద్రం మండలంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందక రైతులు అర్ధరాత్రులు పొలాల వద్ద వేచి ఉండాల్సి వస్తోందని, విద్యుత్ సరఫరాలో అంతరాయాల వల్ల వ్యవసాయ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. నెలల తరబడి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన రైతులు విద్యుత్ సమస్యలతో నష్టపోయే పరిస్థితి రావడం ఆందోళనకరమన్నారు. కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేసి, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల విద్యుత్ అవసరాలు మారుతున్నట్లయితే, అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, పంపిణీ వ్యవస్థను సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపకుండా విద్యుత్ కోతలకు గల వాస్తవ కారణాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులను చేపట్టిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆ విద్యుత్ మౌలిక సదుపాయాలను సమర్థంగా వినియోగించుకుంటూ, రాష్ట్ర అవసరాలకు తగినంత విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు సింగరేణి బొగ్గు సరఫరా ఎంతో కీలకమని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని కోరారు. సింగరేణిలో టెండర్లు, సైట్ విజిట్ సర్టిఫికెట్లు, బొగ్గు నిల్వలు, ఉత్పత్తి, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి బీఆర్ఎస్ లేవనెత్తుతున్న ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి బలహీనపడితే బొగ్గు సరఫరాపై, దాని ప్రభావంతో థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి ఆర్థిక పరిస్థితి, బొగ్గు ఉత్పత్తి, సరఫరా, నిల్వలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. సింగరేణి వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణకు సంబంధించి ఏవైనా ప్రతిపాదనలు ఉంటే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ అవసరాలకు బొగ్గు సరఫరా నిరంతరంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సింగరేణి భవిష్యత్తుపై స్పష్టమైన విధానం ప్రకటించకుండా, విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.కరెంట్ కోతలతో పంటలు నష్టపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాపై జిల్లాల వారీగా వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు నిల్వలు, సరఫరా వివరాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. విద్యుత్ కోతలకు కేవలం అధికారులను బాధ్యులుగా చూపించడం కాకుండా, ప్రభుత్వ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, నిర్వహణపై సమీక్ష నిర్వహించి లోపాలను సరిదిద్దాలని సూచించారు. రైతులకు ఎన్ని గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారో స్పష్టం చేయడంతో పాటు, నిరంతర విద్యుత్ సరఫరా కోసం గడువుతో కూడిన కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు.సింగరేణిని పరిరక్షించడం, విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడం, రైతుల పంటలను కాపాడటం ప్రభుత్వ ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులను తక్షణమే పరిష్కరించి, రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా కోతల బాధతో ప్రజలకు అధిక బిల్లులతో వాతలు పెడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసి శ్రీనాథ్ రెడ్డి, కమ్మటం శ్రీను, హరినాయక్,కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, వీరు నాయక్,వినయ్ రెడ్డి, ఆగె రాము,శరత్ యాదవ్, దేవేందర్, దూడపాక కృష్ణ, ఏర్పుల కుమార స్వామి, మధు తదితరులు పాల్గొన్నారు....